నమస్తే తెలంగాణ
# నల్లగొండ
5 | నల్లగొండ, సోమవారం 22 ఏప్రిల్ 2024 | NALGONDA

# గెలిపిస్తే.. ప్రజల గొంతుకనవుతా..

**ఇటు గల్లీలో.. అటు ఢిల్లీలో బరిగీసి కొట్లాడుతాం..**

- కాంగ్రెస్‌ను నిలబెట్టి హామీలు అమలు చేయిస్తాం..
- మూడు నెలల్లోనే రాష్ట్ర సర్కారు అట్టర్ ఫ్లాప్
- బూర ఎంపీగా గెలిచినా ఏం చేయలే.. ఇప్పుడూ ఏం చేయరు..
- రాహుల్ గాంధీ సంతకాన్ని ఫోర్జరీ చేసిన వ్యక్తి చామల
- ఆయన్ను ఓడించాలని కాంగ్రెస్ నేతలే చూస్తున్నరు..
- భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక
- నియోజకవర్గాన్ని ఐటీ హబ్‌గా మారుస్తా..
- గుట్ట, ఇబ్రహీంపట్నానికి మెట్రో రైల్
- రాయగిరి వరకు ఎంఎంటీఎస్ పొడిగింపు
- మూసీ ప్రక్షాళన..
- ఎయిమ్స్‌లో సదుపాయాలు
- యాదగిరి గుట్టలో ఆయుష్ యూనివర్సిటీ నెలకొల్పుతా..
- జాతీయ రహదారులను ఆరు లేన్లు చేస్తా
- బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పూర్తికి కృషి
- బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్



ఇంటర్వ్యూ Interview

'అలవికాని హామీలతో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ అనతికాలంలోనే పరిపాలనలో అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. మూడు నెలల పరిపాలనే ఇందుకు ఉదాహరణ. ఆరు గ్యారెంటీలు అని ప్రజలను మోసం చేశారు. ఏ ఒక్క హామీ సక్కగా అమలు చేయడం లేదు. హామీలు అమలు కావాలంటే బీఆర్ఎస్ గెలవాలి. ఎంపీగా గెలిపిస్తే ప్రజా గొంతుకనవుతా. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పథకాలను అమలు చేయిస్తా. ఇటు గల్లీలో, అటు ఢిల్లీలో ప్రజల హక్కుల కోసం నిరంతరం కొట్లాడుతా.. ఎట్టి పరిస్థితుల్లో భువనగిరి ఖిలాపై గులాబీ జెండా ఎగరేసి కేసీఆర్‌కు కానుకగా ఇస్తాం' అని బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్ చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో ఆదివారం నమస్తే తెలంగాణ ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలను వెల్లడించారు. ఆయన మాటల్లోనే..

– యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ)

### కాంగ్రెస్‌కు ఓటేసి జనం బాధపడుతున్నరు..

ప్రజలు తొందరపాటులో ఓటేశామని గుర్తించారు. ఇప్పుడు చెయ్యి గుర్తుకు ఎందుకు ఓటేశామా అని బాధపడుతున్నారు. కాంగ్రెస్‌లో నిజమైన కార్యకర్తలకు లాభం జరుగడంలేదు. పారాచూట్ నేతలకే టికెట్లు దక్కుతున్నాయి. చామల కిరణ్ కుమార్ రెడ్డి కూడా పారాచూట్ నేతే. సీనియర్ నేతలు ఉన్నా ఎందుకు టికెట్ ఇవ్వలేదు. రాహుల్ గాంధీ సంతకాన్ని ఫోర్జరీ చేసిన వ్యక్తి చామల. అలాంటి వ్యక్తికి టికెట్ ఇచ్చారు. దీనిపై కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఆలోచిస్తున్నారు. కిరణ్‌కుమార్ రెడ్డి నాకు పోటీ కాదు.

### ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి..

నాకు వందల ఎకరాల భూమి ఉంది. నాకు డబ్బులు సంపాదించుకోవాలనే ఆశ, ఆలోచన లేదు. ప్రజా సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చాను. ఇన్నేండ్ల రాజకీయంలో చిన్న మచ్చలేని వ్యక్తిగా జీవిత ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నా. అవినీతికి ఆమడ దూరంలో ఉంటా. అందరికీ అండగా ఉంటా. ఆపదలో అన్నా.. అని వస్తే ఆదుకుంటా.. నమ్మిన సిద్ధాంతం కోసం పని చేస్తా. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నన్ను గుర్తించి భువనగిరి పార్లమెంట్ స్థానంలో పోటీకి అవకాశం కల్పించారు.

### ఐటీ కంపెనీలు తీసుకొస్తా..

కేసీఆర్ హయాంలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందింది. ఎంపీగా గెలిపిస్తే ఏం చేయాలనేది ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకున్నాం. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఐటీ హబ్‌గా మారుస్తా. ఇందులో ముఖ్యంగా భువనగిరి, ఇబ్రహీంపట్నం, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాలకు ఐటీ కంపెనీలను తీసుకొస్తా. ఈ ప్రాంతాల్లో ఐటీ కంపెనీలు రావడం వల్ల స్థానికంగా ఎంతో అభివృద్ధి జరుగుతుంది. ప్రధానంగా నిరుద్యోగులకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అదే విధంగా భువనగిరిని ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తా.

### మతం, సెంటిమెంట్‌తో బీజేపీ పబ్బం..

కేంద్రంలో బీజేపీ దేశానికి పదేండ్లుగా చేసిందేమీ లేదు. కనీసం చెప్పుకోవడానికి ఫలానా పని అంటూ కనిపించడంలేదు. 2019లో పుల్వామా దాడిని ఉపయోగించుకున్నారు. ఇప్పుడు రామమందిరం పేరుతో రాజకీయం చేస్తున్నారు. త్రేతా యుగం నాటి నుంచి రాముడు ఉన్నారు. వేల సంవత్సరాలుగా దేవుడిగా కొలుస్తాం. బీజేపీ వాళ్లే రాముడిని కొత్తగా కనిపెట్టినట్లు డంభాచారం చేస్తున్నారు. కేవలం మతం, సెంటిమెంట్‌తో పబ్బం గడుపుకొంటున్నది. మాకు అన్ని మతాలు సమానమే. రెచ్చగొట్టి రాజకీయం చేయాలనుకుంటే బీజేపీకి పుట్టగతులుండవ్. బూర నర్సయ్యగౌడ్ ఎంపీగా గెలిచినా ఏం చేయలేదు. ఇప్పుడు కూడా ఏమీ చేయరు.

### యాదగిరి గుట్ట, ఇబ్రహీం పట్నానికి మెట్రో..

యాదగిరిగుట్ట పరిసరాల్లో ఆయుష్ యూనివర్సిటీ నెలకొల్పేందుకు కృషి చేస్తా. దీని వల్ల ఎన్నో రకాలు మేలు జరుగుతుంది. ఇప్పటికే గుట్టకు మాజీ సీఎం కేసీఆర్ మెడికల్ కాలేజీని మంజూరు చేశారు. భక్తుల తాకిడి పెరిగిన యాదగిరిగుట్ట వరకు మెట్రో రైల్‌ను తీసుకొస్తా. రాయగిరి వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగించేందుకు శాయశక్తులా కృషి చేస్తా. అదే విధంగా అటు ఇబ్రహీంపట్నానికి మెట్రో రైలును రప్పిస్తా. జాతీయ రహదారులను ఆరు లేన్లుగా మార్పిస్తా.

### తులం బంగారం దేవుడెరుగు.. కల్యాణలక్ష్మికే దిక్కులేదు..

కాంగ్రెస్‌ను గెలిపిస్తే రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయింది. రాష్ట్ర సర్కారు రైతులను అరిగోస పెడుతున్నది. కరువు తాండవిస్తున్నా కనీసం పట్టించుకోవడంలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో గాలి హామీలు ఇచ్చారు. రూ. 2లక్షల రుణమాఫీ, రైతుబంధు, ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్‌ను మర్చిపోయారు. ఆడబిడ్డల పెండ్లిళ్లకు తులం బంగారం దేవుడెరుగు.. కల్యాణ లక్ష్మికే దిక్కులేదు. చేపలు, గొర్రెల పంపిణీ పథకాలు ఆగిపోయాయి.

### మూసీ ప్రక్షాళన.. ఎయిమ్స్‌లో సదుపాయాలు..

భువనగిరిని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా తీర్చిదిద్దుతా. మూసీ ప్రక్షాళన చేపట్టేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటా. మూసీతో అనేక మండలాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తా. బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వలను పూర్తి చేయిస్తా. వేములకొండ, మోకిల, కొమురెల్లి ఆలయాల అభివృద్ధికి కంకణబద్ధుడై పనిచేస్తా. ఎయిమ్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పించేలా నా వంతు ప్రయత్నం చేస్తాను.

### ఎన్నికల తర్వాత రాజకీయ సంక్షోభం..

పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం వచ్చే అవకాశం ఉంది. అందుకే సీఎం రేవంత్ రెడ్డి బీజేపీతో అంటకాగుతున్నారు. ఆయన పెద్ద గజదొంగ. ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలు, నేతలను చేర్చుకుంటున్నారు. రాహుల్ గాంధీ ఐడియాలజీకి భిన్నంగా రేవంత్ రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారు.

## రాజకీయ ప్రకటనల కోసం ఎంసీఎంసీలో ముందస్తు అనుమతి తీసుకోవాలి : కలెక్టర్ హరిచందన



నల్లగొండ, ఏప్రిల్ 21 : లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సోషల్ మీడియాలో రాజకీయ ప్రకటనల ప్రచారం కోసం పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) ముందస్తు అనుమతి తీసుకోవాలని కలెక్టర్, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాట్సాప్, ట్విట్టర్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్‌తో పాటు ఎలక్ట్రానిక్ మీడియా, స్థానిక కేబుల్ చానల్స్, ఎఫ్‌ఎం రేడియో, ఇతర ఆన్‌లైన్ మీడియా, బల్క్ ఎస్ఎంఎస్‌లు, వీడియో మెసేజ్‌లు, సినిమా థియేటర్లలో అడ్వర్‌టైజ్‌మెంట్స్, కరపత్రాల ముద్రణకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తప్పనిసరిగా ఎంసీఎంసీ అనుమతిని తీసుకోవాలని పేర్కొన్నారు. ఇందుకోసం నల్లగొండ కలెక్టరేట్‌లో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించి కరపత్రాలను ముద్రించినట్లయితే సంబంధిత ప్రచురణ కర్తపై చర్యలు ఉంటాయని చెప్పారు.

# కాంగ్రెస్ అంటేనే దోచుకునే పార్టీ

- దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలే బుద్ధి చెప్తారు
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- గుర్రంపోడు, కనగల్ మండలాల్లో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం



గుర్రంపోడు రోడ్ షోలో పాల్గొన్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, జడ్పీచైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భగత్, తిప్పన

గుర్రంపోడ్/ నల్లగొండ సిటీ, ఏప్రిల్ 21 : 'కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే దోచుకునేది. అమలుకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కల్లబొల్లి మాటలతో కాలం వెల్లదీస్తుంది. జిల్లాలో పనికిరాని మంత్రులు ఉన్నరు. మేము పొడుగున్నామని చెప్పుకోవడానికి తప్పితే రైతులకు ఉపయోగపడని దద్దమ్మలు వారు' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డితో కలిసి ఆదివారం గుర్రంపోడ్, కనగల్ మండల కేంద్రాల్లో రోడ్ షో, ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో కేంద్రాల్లోని వడ్ల రాశులు అకాల వర్షాలకు తడిసి మట్టి పాలవుతుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. జిల్లా మంత్రులు మిల్లర్లు, క్రషర్ మిల్లుల యజమానులను, కాంట్రాక్టర్లను భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చెరువులు కళకళలాడేవని, ఇప్పుడు పూర్తిగా ఎండిపోయి వెలవెలబోతున్నాయని అన్నారు. ఇది పంటలకు నీళ్లు ఇవ్వలేని దద్దమ్మ ప్రభుత్వమని విమర్శించారు. 2014లో రూ.200 ఉన్న పింఛన్‌ను వెయ్యి రూపాయలు చేస్తామని తాము హామీ ఇచ్చామన్నారు. అధికారంలోకి రాగానే ఆ హామీని నెరవేర్చామని చెప్పారు. రెండోసారి అధికారంలోకి రాగానే ఆ పింఛన్‌ను రూ.2వేలు చేశామన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతు బంధు, కేసీఆర్ కిట్, రైతు బీమా ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేశామని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు పరుస్తూ చెప్పని అనేక పథకాలను అమలు చేశామని చెప్పారు. 420 దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 120 రోజులైనా ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పి బీఆర్ఎస్‌ను గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి, కనగల్ ఎంపీపీ కరీంపాషా, గుర్రంపోడ్ వైస్ ఎంపీపీ వజ్జ రామేశ్వరీధనుంజయ్, పార్టీ రాష్ట్ర నాయకులు సత్తయ్యగౌడ్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, యాదయ్య గౌడ్, మర్రి రేణుక పాల్గొన్నారు.



గుర్రంపోడులో బీఆర్ఎస్ రోడ్ షోకు పెద్ద ఎత్తున హాజరైన జనం



కనగల్‌లో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారానికి పెద్ద ఎత్తున హాజరైన జనం

### రైతుల పక్షాన కొట్లాడుతా

ఇది రైతు బిడ్డకు, రాజకీయ నాయకుడి బిడ్డకు మధ్య పోటీ. నన్ను గెలిపించి లోక్‌సభకు పంపితే రైతుల పక్షాన కొట్లాడుతా. ప్రతి మండలంలో కార్పొరేట్ విద్య, వైద్యం అందించేందుకు కృషి చేస్తా. రైతులకు మూడు పంటలకు నీళ్లు అందించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుంది. దేశంలోనే అత్యధిక వరి పండించే రాష్ట్రంగా తెలంగాణను మొదటి స్థానంలో నిలిపారు.

– కంచర్ల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి

### సంక్షేమం అంటేనే కేసీఆర్

బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రాన్ని వ్యవసాయం, విద్య, విద్యుత్ రంగాల్లో, సంక్షేమంలో, సాగు, తాగునీరు సరఫరాలో మొదటి స్థానంలో ఉంచిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుంది. రైతులకు 24 గంటల కరెంట్, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్‌దే. అమలు కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాలుగు నెలలు అవుతున్నా ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలి.

– ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

### అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది

420 హామీలతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ఒక్కటీ నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది. వృద్ధులకు రూ.4 వేల పింఛన్, నిరుద్యోగ భృతి రూ.4వేలు, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు, ధాన్యానికి బోనస్ రూ.500, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఏ ఒక్కటీ అమలు చేయలేదు. ప్రజలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

– నోముల భగత్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే

# రైతు బంధుకు కొర్రీలు!

- సాగు చేస్తేనే పథకం అమలుకు ప్రభుత్వం కుట్రలు
- యాసంగి సీజన్ పూర్తయినా ఇంకా అందరికీ అందని రైతు బంధు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



సూర్యాపేట, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకం తీసుకొచ్చి అన్నదాతలకు అండగా నిలిచింది. వానకాలం, యాసంగికి రూ.5 వేల చొప్పున ఏటా ఎకరానికి రూ.10 వేలు అందించి పంట పెట్టుబడికి ఇబ్బంది లేకుండా చేసింది. కానీ కాంగ్రెస్ పార్టీ రైతు బంధు పథకాన్ని రైతు భరోసాగా మార్చింది. పంట పెట్టుబడి సాయాన్ని మరింత పెంచి ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చింది. కానీ ఇంతవరకు పెంచి ఇవ్వక పోగా ఇప్పటివరకు ఐదెకరాల్లోపు రైతులకు కూడా పూర్తిస్థాయిలో రైతుబంధు అందివ్వలేదు. దాంతో రైతులు అరిగోస పడుతున్నారు. మరో వైపు ఇచ్చిన హామీని నెరవేర్చలేని సర్కారు రైతుబంధును నిలిపివేసే కుట్ర చేస్తున్నది. వచ్చే సీజన్ నుంచి సాగు చేసే భూములకే రైతు బంధు ఇస్తామని ప్రభుత్వం చెబుతుండడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాగు భూమిని లెక్కేసేందుకు శాటిలైట్ వెరిఫికేషన్ అంటుండగా అసలు రైతు భూమికి కో ఆర్డినేట్స్ లేకుండా శాటిలైట్ ద్వారా ఎక్కడి నుంచి ఎక్కడి దాకా ఉందనేది తెలిసే పరిస్థితి లేదు. ఒకవేళ ఏఈఓలతో వెరిఫై అన్నా మళ్లీ అనేక సమస్యలు తలెత్తి గందరగోళం నెలకొనే అవకాశం ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం స్వయం ప్రకటిత కరువు తెచ్చి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి సాగు చేసే భూమికే రైతు భరోసా ఇస్తామంటున్నదని, దశలవారీగా రైతు భరోసాను తొలగించేందుకు కుట్ర పన్నుతుందని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. సొంత భూమి ఉన్న రైతులకే రైతు బంధు ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రానున్న రోజుల్లో కౌలు రైతుకు ఎట్లా ఇస్తుందని పేర్కొంటున్నారు. కాంగ్రెస్‌ను నమ్మితే రైతులు నట్టేట మునిగినట్లేనని వ్యాఖ్యానిస్తున్నారు.

### సమస్యలు సృష్టించేందుకే..



కాంగ్రెస్ సర్కారు పంట వేసిన రైతుకే రైతు బంధు అంటున్నది. శాటిలైట్ వెరిఫికేషన్ అని మరో నాటకం ఆడుతున్నది. సమస్యలు సృష్టించేందుకే ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలిసారే రైతులకు రైతుబంధు ఇవ్వలేదు. ఇంకా శాటిలైట్ సర్వే చేసి ఇస్తామనడం రైతులను మోసం చేసేందుకే. కాలం కాకపోతే రైతులు సాగు చేసేది ఎట్లా.

– నామిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఇరుగంటిపల్లి, కనగల్ మండలం

### శాటిలైట్ సర్వేలు రైతులకు మేలు చేయవు



ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుంది. గత కేసీఆర్ ప్రభుత్వం రైతులకు వెంటవెంటనే రైతుబంధు అందించి రైతుల కష్టాలను తీర్చింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతుబంధు ఇవ్వలేక కొర్రీలు పెడుతూ శాటిలైట్ ద్వారా పంట సర్వే చేయించి రైతుబంధు వేస్తామని చెప్పడం హాస్యాస్పదం. శాటిలైట్ సర్వేల వల్ల రైతులకు, కౌలు రైతులకు ఎటువంటి ప్రయోజనం చేకూరదు. ఇప్పటివరకు అన్న మాటలను నిలబెట్టుకోని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తుత ఎన్నికల్లో రైతులకు మేలు చేస్తామని చెప్పడం ఎంతవరకు కరెక్ట్. గత ప్రభుత్వం మాదిరిగానే రైతులను ప్రతి కారుకు రైతుబంధు వేసి రైతులను ఆదుకోవాలి.

– నామిరెడ్డి యాదగిరిరెడ్డి, రైతు సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు

### రైతులను ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం



రైతులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు మేలు చేసే ఒక్క కార్యక్రమమైనా చేయడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాడు. ఇప్పుడు ఇంకో విధానంతో రైతులను మోసం చేయడానికి చూస్తున్నాడు. కాంగ్రెస్‌కు సరైన టైంలో బుద్ధి చెప్పడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు.

– కట్టా దామోదర్‌రెడ్డి, రైతు, ఇందుగుల, మాడ్గులపల్లి

### రైతుబంధు రద్దుకు దారులు వెతుకుతున్న ప్రభుత్వం



రైతులకు తగిన సమయంలో రైతు బంధు ఇవ్వకుండా, రైతు బంధును ఎలా తగ్గించుకోవాలనే ఆలోచనలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. యాసంగికి జనవరి నెలలో ఇవ్వాల్సిన రైతు బంధు కొంత మందికే వచ్చింది. మిగతా రైతుల ఊసేలేదు. రైతు బీమా కరువైంది. పోనీ రైతులకు వచ్చే వానకాలం సీజన్‌కు రైతు బంధు ఎలా ఇవ్వాలి అన్న ఆలోచన కాకుండా పంటల సాగుతో రైతు బంధు ఎగ్గొట్టాలా అని చూస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు విషయంలో పునరాలోచించాలి.

–బచ్చు సైదులు యాదవ్, రైతు, ఊట్లపల్లి, మిర్యాలగూడ

### కాంగ్రెస్‌ను నమ్మితే నడిసంద్రంలో ముంచుతుండ్రు



కాంగ్రెస్ 100రోజుల పాలనలో రైతుకు అంతా శూన్యమే. వారి మాటలు నమ్మి అధికారం ఇస్తే రైతులను నడిసంద్రంలో ముంచుతుండ్రు. రైతుబంధుపై అప్పుడే కొర్రీలు పెడుతుండ్రు. 5ఏకరాలలోపు వారికే రైతుబంధు వర్తిస్తదని రైతుకు పంగనామాలు పెడుతున్నారు. కరెంట్ కష్టాలు అపుడే మొదలయ్యాయి. గత ప్రభుత్వంలో రైతుకు రైతుబంధుతో ఎంతో భరోసా దొరికేది. ఎంత భూమి ఉన్న వారికైనా ఏకకాలంలో పంటవేసే సమయానికి నేరుగా బ్యాంకు ఖాతాలో పడిపోయేది. ఇపుడు రైతుబంధు కోసం ఎకరా ఉన్న రైతుకూడా ఎప్పుడు పడుతుందా అని ఎదురుచూడాల్సిన పరిస్థితి దాపురించింది. మళ్లీ అప్పులు చేసే రోజులొచ్చాయి. మళ్లీ శాటిలైట్‌ను ఉపయోగించి పంట విస్తీర్ణాన్ని అంచనా వేసి రైతుభరోసా ఇస్తామంటున్నరు. ఇది ఎలా సాధ్యపడుతుందో తెలియని పరిస్థితి.

– మల్లెబోయిన సుధాకర్ రైతు, యాద్గార్‌పల్లి, మిర్యాలగూడ

### అర్హులందరికీ రైతుబంధు ఇవ్వాలి



కేసీఆర్ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి అవసరాల కోసం దళారుల దగ్గరకు పోకుండా ఎకరానికి రెండు పంటలకు 10 వేల రూపాయలు ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధును ఇవ్వడంలో ఇబ్బందులకు గురిచేస్తున్నది. విడుతలవారీగా ఇచ్చినా అందరికీ ఇంకా అందలేదు. వానకాలం నుంచి పంట వేస్తేనే రైతుబంధు ఇస్తామంటున్నరు. దాని వల్ల చాలామంది రైతులు నష్టపోవాల్సి వస్తుంది. గత ప్రభుత్వంలాగానే అర్హులైన రైతులందరికీ రైతుబంధు ఇవ్వాలి.

–బెల్లంకొండ నాగయ్య, రైతు చిలుకూరు

## నేడు బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ నామినేషన్

- పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 21 : బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్ సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం భువనగిరిలోని బీఆర్ఎస్ కార్యాలయం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లనున్నారు. జిల్లా పరిషత్ చైర్మన్‌తోపాటు బీఆర్ఎస్ భువనగిరి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ నెల 25న భువనగిరి పట్టణంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షో ఉన్నందున క్యామ మల్లేశ్ నామినేషన్‌కు పెద్దగా జన సమీకరణ చేపట్టడం లేదు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు తరలిరానున్నారు.

# ముగిసిన టెట్ దరఖాస్తు గడువు

**ఉమ్మడి జిల్లాలో పేపర్-1కు 8,130, పేపర్-2కు 19,361 దరఖాస్తులు**

**అప్లికేషన్ ఫీజు పెంపుతో దరఖాస్తు చేయలేదని చాలా మంది అభ్యర్థుల ఆవేదన**

రామగిరి, ఏప్రిల్ 21 : ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశానికి నిర్వహించే టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్‌టీ)కు దరఖాస్తు చేయడానికి టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)లో అర్హత సాధించాల్సి ఉంటుంది. కాగా, టెట్-2024కు దరఖాస్తు గడువు ఈ నెల 20తో ముగియగా.. ఉమ్మడి జిల్లాలో గతంలో కంటే ఈ పర్యాయం దరఖాస్తుల సంఖ్య తగ్గిందని విద్యాశాఖ విడుదల చేసిన గణాంకాల ఆధారంగా తెలుస్తుంది. గతంలో బీఈడీ చేసిన అభ్యర్థులు టెట్ పేపర్-1, 2 రెండింటికీ దరఖాస్తు చేసుకుని రాసే అవకాశం ఉండేది. ప్రస్తుతం పేపర్-1కు టీటీసీ (డీఈడీ), పేపర్-2కు బీఈడీ చేసిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. మరోవైపు గతంలో దరఖాస్తు ఫీజు రూ.200 (ఒక్క పేపర్)కు ఉండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం పేపర్‌కు వెయ్యి రూపాయలుగా నిర్ణయించింది. దాంతో చాలా మంది పేద విద్యార్థులు టెట్ దరఖాస్తు చేయకుండా దూరంగా ఉన్నారు. మరో వైపు గతంలో పరీక్ష ఓఎంఆర్ విధానంలో ఉండగా, ఈ పర్యాయం కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానం తీసుకొచ్చారు. ఈ విధానంతో అభ్యర్థులకు పరీక్ష కేంద్రం అందుబాటులో లేకుండా దూరంగా పడుతుంది. అక్కడికి వెళ్లి పరీక్ష రాయాలంటే రవాణా చార్జీలు భారంగా భావించి కొంత మంది దరఖాస్తు చేయలేదని తెలుస్తుంది.

### ఉమ్మడి జిల్లాలో వచ్చిన దరఖాస్తులు ఇలా...

టెట్-2024కు మార్చి 27 నుంచి ఏప్రిల్ 20వరకు దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పేపర్-1కు 8,130 మంది, పేపర్-2కు 19,361మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 2023లో దరఖాస్తుల సంఖ్యతో చూస్తే ఉమ్మడి జిల్లాలో ఈసారి భారీగా తగ్గింది. 2023 సెప్టెంబర్ 15న జరిగిన టెట్‌కు నల్లగొండ జిల్లాలో పేపర్ - 1కు 12,923 మంది, పేపర్ -2కు 10,480 మంది దరఖాస్తు చేసి పరీక్ష రాశారు. సూర్యాపేట జిల్లాలో పేపర్ -1కు 7,397 మంది, పేపర్-2కు 6,664 మంది, యాదాద్రి భువనగిరి జిల్లాలో పేపర్ -1కు 2,975, పేపర్-2కు 2,822 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పర్యాయం దరఖాస్తు ఫీజు పెంచడంతో చాలా మంది దరఖాస్తులు చేయలేదు.

| జిల్లా | పేపర్ -1 | పేపర్ -2 గణితం అండ్ సైన్స్ | పేపర్-2 సోషల్ | మొత్తం |
|---|---|---|---|---|
| నల్లగొండ | 3,954 | 7,168 | 1,994 | 9,162 |
| సూర్యాపేట | 3,242 | 4,189 | 1,578 | 5,767 |
| యాదాద్రి | 934 | 1,968 | 2,464 | 4,432 |
| మొత్తం | 8,130 | 13,325 | 6,036 | 19,361 |